ముమ్మరంగా వ్యవసాయ పనులు

దుమ్ముగూడెం, జూలై 14: మండలంలో వ్యవసాయ పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. కొన్ని రోజులుగా వర్షాలు కురుస్తుండడంతో మండలంలో 22 వేల ఎకరాల్లో వానకాలం పంట సాగు చేస్తున్నారు. ముందుగా నారు మడులు సిద్ధం చేసుకొని నాట్లు వేసేందుకు సంసిద్ధమవుతున్నారు. కొందరు నారు పోస్తుండగా, మరి కొందరు నాట్లు వేసేందుకు సిద్ధమయ్యారు. ఆదివారం 30.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు తహసీల్దార్ తెలిపారు.

నేడు కలెక్టరేట్‌లో 'ప్రజావాణి'

కొత్తగూడెం టౌన్, జూలై 14: ఈ నెల 15న సోమవారం కలెక్టరేట్‌లో ప్రజావాణి కార్యక్రమం నిర్వహించనున్నట్లు కలెక్టర్ జితేష్ వి పాటిల్ ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని శాఖల అధికారులు సకాలంలో హాజరుకావాలని పేర్కొన్నారు. ప్రజలు తమ అర్జీలను లిఖితపూర్వకంగా ఇవ్వాలని కోరారు. ఉదయం 10.30 గంటలకు ప్రజావాణి ప్రారంభమవుతుందని తెలిపారు.

సరోజిని వృద్ధాశ్రమంలో అన్నదానం

భద్రాచలం, జూలై 14: పట్టణంలోని కూనవరం రోడ్డులో ఉన్న సరోజిని వృద్ధాశ్రమంలో సహాయ ఫౌండేషన్ నిర్వాహలు బిర్రు సుధాకర్, సరిత దంపతుల ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. పట్టణానికి చెందిన హైకోర్టు న్యాయమూర్తి భీమపాక నగేష్, రాధా పరమేశ్వరి దంపతుల కుమార్తె మనస్వి పుట్టిన రోజు సందర్భంగా వృద్ధాశ్రమంలో అన్నదానం చేశారు. కార్యక్రమంలో కృష్ణ సాయి, సురేంద్ర, వాసవి, ప్రియాంక, అభిలాష్ తదితరులు పాల్గొన్నారు.

నూతన చట్టాలపై అవగాహన

జూలూరుపాడు, జూలై 14: నూతన చట్టాలపై ఆటో డ్రైవర్లకు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఆదివారం ఎస్సై బానోత్ రాణా ప్రతాఫ్ అవగాహన కల్పించారు. ఆటో డ్రైవర్లు తప్పనిసరిగా వాహనం సీ బుక్, పొల్యూషన్ సర్టిఫికెట్, ఇన్సూరెన్స్, డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాల, యూనిఫాం ధరించాలని చెప్పారు. నిర్లక్ష్యంగా డ్రైవింగ్ చేయవద్దని, ప్రయాణికులతో మర్యాదగా నడుచుకోవాలని అన్నారు.

కార్మిక నాయకుడు కనకాచారికి నివాళి

రామవరం, జూలై 14: స్థానిక నేతాజీ బస్తీకి చెందిన సింగరేణి విశ్రాంత ఉద్యోగి, కార్మిక నాయకుడు ఆలేటి కనకాచారి ఆదివారం మృతి చెందారు. మృత దేహాన్ని సీపీఐ జిల్లా కార్యదర్శి సాబీర్ పాషా తదితరులు సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి, సంతాపం తెలిపారు. నాయకులు మునిగడప వెంకటేశ్వర్లు, సత్తి, బాబురావు, కాంపెల్లి దుర్గయ్య, వీరయ్య, మంగమ్మ పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్ Classifieds
TOURS & TRAVELS

★మహాదేవ టూర్స్: 6th నవంబర్-కార్తీక మాసంలో కాశీ+12 క్షేత్రాలు. Ac Bus 20 స్లీపర్+20 సిట్టింగ్ 15 రోజులు. చార్‌ధాం 20th, సెప్టెంబర్ 3rd Ac. సంప్రదించండి: 9676637578.
NT-339536

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

పేరుకు జాతీయ రహదారి.. రోడ్డంతా గుంతల మయం

ఈ రోడ్డులో ప్రయాణమంటేనే జంకుతున్న వాహనదారులు

అశ్వారావుపేట టౌన్, జూలై 14 : తెలంగాణ మీదుగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోకి వెళ్లే ప్రధాన జాతీయ రహదారి గుంతలు మయంగా మారడంతో ఈ రహదారిలో ప్రయాణం ప్రాణసంకటంగా మారిందని వాహనదారులు వాపోతున్నారు. ముఖ్యంగా పట్టణంలోని రింగ్ రోడ్డు నుంచి స్థానిక వ్యవసాయ కళాశాల వరకు అడుగడుగునా పెద్ద పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. రింగ్ రోడ్డు నుంచి జంగారెడ్డిగూడెం వెళ్లే రహదారి సైతం ఇదే పరిస్థితి నెలకొన్నది. నాలుగైదు నెలలుగా ఈ రహదారిపై గుంతలు ఆధ్వాన్నంగా ఉండడంతో ఇటుగా వెళ్లే భారీ వాహనాలు ఒక్కసారిగా మర్మతులకు గురవుతున్నాయని వాహనదారులో ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇక మూలమలుపుల వద్ద పరిస్థితి మరీ దారుణంగా ఉందని వాపోతున్నారు. నాలుగు నెలల క్రితం ఆర్‌అండ్‌బీ అధికారరులు మర్మతులు చేపట్టిన అవి నామమాత్రం కావడంతో ఇటీవల కురుస్తున్న వర్షాలతో అవి కాస్తా భారీ గోతులుగా ఏర్పడి ప్రమాదాలకు నిలయంగా మారాయని, ఈ రహదారిలో ప్రయాణించాలంటేనే వాహనదారులు జంకుతున్నారు. ఇప్పటికైనా అధికారులు, పాలకులు స్పందించి మర్మతులు చేపట్టాలని వాహనదారులతో పాటు స్థానిక ప్రజలు కోరుతున్నారు.

జాతీయ రహదారిపై ఏర్పడిన గుంతలు.. నెమ్మదిగా వెళ్తున్న వాహనాలు

ప్రయాణం.. ప్రాణ సంకటం..

భవనం పక్కనే నీటి నిలువలు

అంగన్‌వాడీ, పంచాయితీ కార్యాలయం పక్కన ఉన్న మద్యం సీసాలు

ఒకే భవనంలో అంగన్‌వవాడీ, పంచాయతీ కార్యాలయం

టేకులపల్లి, జూలై 14 : మండల పరిధిలోని కొత్తతండా(జి) పంచాయతీ కార్యాలయంలో పంచాయతీ ఆఫీస్‌తో పాటూ అంగన్‌వాడీ కేంద్రం నిర్వహిస్తుండడంతో సిబ్బంది, చిన్నపిల్లలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అసలే వానకాలం సీజన్ వ్యాధులు వ్యాప్తి చెందే కాలం కావడంలో పారిశుధ్య పనులు సక్రమంగా నిర్వహించపోవడంతో దోమలు వ్యాప్తి చెంది అనారోగ్యం పాలవుతామని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పంచాయతీ కార్యాలయంలో అంగన్‌వాడీ పిల్లలు ఉండడాన్ని గమనించిన 'నమస్తే' సిబ్బంది అంగన్‌వాడీ సిబ్బందిని వివరణ కోరగా ఇది అంగన్‌వాడీ కేంద్రమేనని కానీ కొన్ని నెలలుగా పంచాయతీ కార్యాలయాన్ని ఈ భవనంలోకి మార్చారన్నారు. ఒకే భవనంలో ఒక పక్క పిల్లలు, మరో పక్క పంచాయతీ కార్యాలయ వస్తువులు వాటికి తోడు కార్యాలయం చుట్టూ నీటి నిల్వలు, తాగి పడేసిన మద్యం సీసాలు ఉండడంతో ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. పంచాయతీ కార్యదర్శి వరుణ్‌ను వివరణ కోరగా కొన్నేళ్ల క్రితం ఇది అంగన్‌వాడీ కేంద్రమే కానీ శిథిలావస్థకు చేరడంతో దానిని రిపేర్ చేయించి పంచాయతీ కార్యాలయంగా ఉపయోగిస్తున్నామని, అంగన్‌వాడీ సెంటర్‌ను ఓ అద్దె ఇంట్లో ఏర్పాటు చేశారు. కానీ ఐదు నెలలుగా మళ్లీ ఆ సెంటర్‌ను ఈ భవనంలోకి మార్చారని తెలిపారు. ఏది ఏమైనా దీనిపై స్థానిక ప్రజలు ఉన్నత అధికారులు చొరవ తీసుకొని పంచాయతీలో ఉన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతున్నారు.

ఎవరో వస్తారని.. ఎదురు చూడకుండా..!

పాల్వంచ, జూలై 14: అక్కడొక సమస్య ఉంది. దానితో ఇబ్బందిపడుతున్న వాళ్లంతా, అధికారులు ఎవరో వస్తారని.. ఏదో చేస్తారని ఇన్నాళ్లూ ఎదురుచూశారు. ఫలితం లేకపోవడంతో అక్కడున్న కొందరు రంగంలోకి దిగారు. పాల్వంచ బస్టాండులోకి బస్సులు వెళ్లే మార్గంలో వర్షపు నీళ్లు మోకాళ్ల లోతున నిలిచాయి. దీంతో ప్రయాణీకులు ఇబ్బంది పడుతున్నారు. దీనిని ఆర్టీసీ అధికారులు పట్టించుకోవడం లేదు. అక్కడికి సమీపంలోనే ఆటోల అడ్డా ఉంది. అక్కడి ఆటో డ్రైవర్లంతా కలిసి ఆదివారం డోజర్ తెప్పించారు. నీళ్లు ఆగినచోట నేలను చదును చేయించారు. దీంతో నీటి మడుగు మాయమైంది. వారిని స్థానికులు, ప్రయాణీకులు అభినందించారు.

గుంతలను పూడుస్తున్న డోజర్

జూనియర్ మైనింగ్ ఇంజినీర్ ట్రైనీ రాత పరీక్ష

కొత్తగూడెం సింగరేణి, జూలై 14: సింగరేణిలో ఖాళీగా ఉన్న జూనియర్ మైనింగ్ ఇంజినీర్ ట్రైనీ (జేఎంఈటీ) ఈఅండ్‌ఎఫ్ గ్రేడ్ సీ పోస్టుల భర్తీకి అంతర్గత అభ్యర్థులకు స్థానిక మహిళా డిగ్రీ కాలేజీ కేంద్రంలో ఆదివారం రాత పరీక్ష జరిగింది. ఈ కేంద్రాన్ని జీఎం (పర్సనల్) బీఆర్ దీక్షితులు పరిశీలించారు. మొత్తం 375 మంది అభ్యర్థులకుగాను 361 మంది హాజరైనట్లు చెప్పారు. వివిధ శాఖల అధికారులు రాంకుమార్‌రావు, వేణుగోపాలరావు, వీఎన్ వీఎస్‌ఆర్ శాస్త్రి, పీవీఎస్ శాస్త్రి, జాకీర్ హుస్సేన్, ప్రకాశరావు తదితరులు పాల్గొన్నారు.



పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న దీక్షితులు

'పాల్వంచ మున్సిపాలిటీకి ఎన్నికలు నిర్వహించాలి'

పాల్వంచ, జూలై 14: పారిశ్రామిక ప్రాంతమైన పాల్వంచ మున్సిపాలిటీకి ప్రభుత్వం ఎన్నికలు నిర్వహించేలా చొరవ చూపాలని పాల్వంచ గ్రీన్ ఎర్త్ సొసైటీ అధ్యక్షుడు రమేశ్ రాథోడ్ కోరారు. జిల్లా పర్యటనలో భాగంగా శనివారం రాత్రి పాల్వంచకు వచ్చిన జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు జాటోత్ హుస్సేన్‌నాయక్‌ను రమేశ్ రాథోడ్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఎన్నికలు, పాలకవర్గాలు లేకపోవడం వల్ల అభివృద్ధి కుటుంబపడుతున్నందున ఎన్నికల నిర్వహణకు చొరవ తీసుకోవాలని కోరారు. డాక్టర్ వీరూనాయక్, తేజావత్ మోహన్, బాలకృష్ణ, సురేశ్, ప్రవీణ్ బానోత్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడిని సన్మానిస్తున్న నాయకులు

ఘనంగా పీర్ల ఊరేగింపు

టేకులపల్లి/చంద్రుగొండ, జూలై 14 : టేకులపల్లి, చంద్రుగొండ మండల్లాలో కుల మతాలకు అతీతంగా పీర్ల పండుగను ఏడో రోజు ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఆదివారం టేకులపల్లి మండలంలోని మూడ్‌తండా పీర్ల చావిడి వద్ద పీర్ల గుండం ఏర్పాటు చేశారు. పీర్ల ఊరేగింపు కార్యక్రమం నిర్వహించారు. కులమతాలకు అతీతంగా మండలంలోని పలు గ్రామాల్లో పీర్ల చావిడి వద్ద 11రోజుల పాటు వేడుకలు నిర్వహించారు. చంద్రుగొండలో ముస్లిం సోదరులు పీర్ల ను ఊరేగించారు.

బోడు రోడ్డు సెంటర్‌లో పీర్ల ఊరేగింపులో పాల్గొన్న భక్తులు

నమస్తే తెలంగాణ మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ దినపత్రికలో చందా కొరకై మరియు పత్రికా పంపిణీలో ఏమైన సమస్యలు ఉంటే సంప్రదించగలరు
సెల్ : 9182777073
నమస్తే తెలంగాణ దినపత్రికలో అన్ని రకాల ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించగలరు
సెల్ : 9182777616

భద్రాద్రి రామాలయం అర్చకుల బదిలీలు ఆపాలి

భద్రాచలం, జూలై 14: భద్రాచలం సీతారామచంద్రస్వామివారి దేవస్థానం ఉద్యోగులను బదిలీ చేస్తున్నామని దేవస్థానం ఉన్నతాధికారులు అర్చకులకు నోటీసులు ఇచ్చారు. దీంతో అర్చకులు ఆదివారం స్థానిక ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావును కలసి తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అర్చకులు మాట్లాడుతూ భక్త రామదాసు ఆలయ నిర్మించిన తరువాత తమిళనాడులోని శ్రీరంగం నుంచి ఐదు కుటుంబాలను భద్రాచలం రామాలయంలో అర్చకత్వం చేసేందుకు తీసుకుని వచ్చారన్నారు. గత నాలుగు వందల ఏళ్లకు పైగా వంశపారంపర్యంగా తాము అర్చకత్వం నిర్వహిస్తున్నామని వివరించారు. బదిలీల విషయంలో తాము ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలుస్తామన్నారు. మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డికి ఫోన్ చేసి విషయం వివరించారని, సోమవారం మంత్రిని కలుస్తామని అర్చకులు అర్చకులు తెలిపారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో దేవస్థానం ఆస్థాన స్థానాచార్యులు కేఈ స్థలశాయి, ఆలయ ప్రధానార్చకుడు పొడిచేటి సీతారామానుజాచార్యులు, ఉప ప్రధానార్చకులు కోటి శ్రీమన్నారాయణచార్యులు, అమరవాది మురళి కృష్ణమాచార్యులు, అమరవాది గోపాలకృష్ణమాచార్యులు, అమరవాది రామానుజాచార్యులు పాలొన్నారు. తొలుత అర్చకులు ఎమ్మెల్యేను శాలువాతో సత్కరించి, ఆశీర్వదించారు.

పింఛన్ సొమ్ము రికవరీ హేయమైన చర్య

అశ్వారావుపేట టౌన్, జూలై 14 : కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాకముందు కొత్తగా అనేక సంక్షేమ పథకాలు ప్రజలకు అమలు చేస్తామని మాయమాటలు చెప్పి నేడు అధికారంలోకి వచ్చి లబ్ధిదారుల నుంచి సొమ్మును లాక్కునే ప్రయత్నం చేస్తున్నదని బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు సత్యవరపు సంపూర్ణ, యువజన విభాగం నాయకులు మోటూరి మోహన్, వగ్గెల పూజలు విమర్శించారు. ఆదివారం స్థానికంగా జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఆసరా పింఛన్ సొమ్మును నాటి ముఖ్యమంత్రి కేసీఆర్ అందించిన రూ. 2016 స్థానంలో గద్దెనెక్కిన రేవంత్ రెడ్డి రూ. 4 వేలు ఇస్తానని మాటమార్చిందని, ఇప్పటు పండుటాకుల వద్ద నుంచి పింఛన్ రికవరీ పేరుతో సొమ్మును వెనక్కి లాక్కుంటుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ దుర్మార్గపు చర్యను బీఆర్ఎస్ పార్టీ ఖండిస్తుందన్నారు. కార్యక్రమంలో కాసాని చంద్రమోహన్, యూత్ ప్రెసిడెంట్ సోమాని రాజారమేశ్, ధర్మ, శివ, వెంకన్న, శేఖర్, రవి ఉన్నారు.

మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

విధుల్లో చేరిన ఎస్సై స్వప్న

చంద్రుగొండ, జూలై 14 : చంద్రుగొండ పోలీస్‌స్టేషన్‌లో ఎస్సై జి.స్వప్న ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... శాంతిభద్రతల విషయంలో రాజీపడేదిలేదని, పోలీసులకు ప్రతిఒక్కరూ సహకరించాలన్నారు. గ్రామాల్లో అపరిచిత వ్యక్తులు సంచరిస్తే వెంటనే సమాచారం ఇవ్వాలన్నారు. గ్రామాల్లో పేకాట, కోడిపందేలు నిర్వహించే వారి వివరాలు తెలియజేయాలని, తెలిపిన వారి పేర్లను గోప్యంగా ఉంచుతామన్నారు.

బదిలీ అయిన ఉపాధ్యాయులను వెంటనే రిలీవ్ చేయాలి

దమ్మపేట, జూలై 14 : బదిలీ అయిన ఉపాధ్యాయులను రిలీవ్ చేయాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి రమేశ్ ప్రభుత్వాన్ని కోరారు. దమ్మపేటలో ఆదివారం జరిగిన ఆ సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. బదిలీ అయిన ఉపాధ్యాయుల స్థానంలో విద్యావలంటీర్లను నియమించాలని సూచించారు. వెబ్ ఆప్షన్లలో జరిగిన పొరపాట్లను అపీల్ చేసుకున్న ఉపాధ్యాయులకు న్యాయం చేయాలన్నారు. పెండింగ్ నాలుగు డీఏలను, పీఆర్‌సీ ప్రక్రియను పూర్తిచేయాలని అన్నారు. సమావేశంలో ప్రసాద్, రామారావు, కనకదుర్గ, సురేశ్ పాల్గొన్నారు.

సీతారామ ప్రాజెక్టు సాగునీరు జిల్లా రైతులకే దక్కాలి

ములకలపల్లి, జూలై 14 : ఉమ్మడి జిల్లా సాగునీటి ప్రాజెక్టు అయిన సీతారామ ప్రాజెక్టు సాగునీరు తొలుత జిల్లా రైతులకే దక్కాలని సీపీఎం జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం ములకలపల్లిలో ఏర్పాటు చేసిన ఆ పార్టీ మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ... జిల్లా రైతులకు సరైన సాగునీటి వనరులు లేవని, చిన్న, సన్నకారు రైతులే అధికంగా ఉన్నారని వారందరికీ సీతారామ ప్రాజెక్టు వరంగా మారాలన్నారు. సాగునీటి ప్రాజెక్టు పూర్తైనా ఇక్కడ రైతులకు ఇవ్వకుండా ప్రభుత్వం అన్యాయం చేస్తుందని ఆవేదన వ్యక్తం చేశాడు. రెండు లక్షల రుణమాపీ, రైతుభరోసా వెంటనే అమలు చేయాలన్నారు. సమావేశంలో నాయకులు ముదిగొండ రాంబాబు, మాలోతు రావుజ, గొగ్గల ఆదినారాయణ, నిమ్మల మధు, డిష్, కుంజా రామ్మూర్తి, గోపగాని లక్ష్మి, నరసయ్య, బైరు ప్రసాద్, పాల్గొన్నారు.

హమీలను అమలు చేయాలి

చంద్రుగొండ, జూలై 14 : తెలంగాణ ఉద్యమకారులకు ప్రభుత్వం ఎన్నికల హామీలను వెంటనే అమలు చేయాలని తెలంగాణ ఉద్యమకారుల సంఘం(జేఏసీ) నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఉద్యమకారుల సమావేశంలో నాయకులు మాట్లాడుతూ... తెలంగాణ ఉద్యమంలో నాడు జేఏసీ పిలుపుమేరకు దశలవారీగా ఆందోళనలో పాల్గొనడం జరిగిందని, కేసులు సైతం మాపై నమోదు అయ్యాయన్నారు. కాంగ్రెస్ ఎన్నికల హామీల్లో ఉద్యమకారులకు పెన్షన్లు, ఇండ్లు ఇస్తామని హామి ఇచ్చారని, ప్రభుత్వం వచ్చి ఏడు నెలలు దాటినా నేటికి అవి అమలు కావడంలేదన్నారు. సమావేశంలో జేఏసీ నాయకులు గాదె లింగయ్య, సైదయ్య, షేక్ జాపర్, శ్రీరాములు రమేశ్, ఆకుల శ్రీనివాసరావు, సుంకర రామారావు, చల్లపల్లి రాజా, జిల్లేల రాము, అంచ యాకయ్య, నాబీద్, అన్వర్, సులగం శ్రీను, జాకీర్, ముస్తఫా పాల్గొన్నారు.

భద్రాద్రి రామయ్యకు సువర్ణ పుష్పార్చన

రామయ్యకు నిత్య కల్యాణం జరిపిస్తున్న అర్చకుడు

భద్రాచలం, జూలై 14: భద్రాచలం దివ్యక్షేత్రంలో ఆదివారం అంతరాలయంలోని మూలవరులకు 108 సువర్ణ పుష్పాలతో అర్చకులు అర్చన జరిపారు. తెల్లవారుజామున ఆలయ తలుపులు తెరిచి స్వామివారికి సుప్రభాత సేవ, ఆరాధన, ఆరగింపు, సేవాకాలం, నిత్య హోమాలు, నిత్య బలిహరణం తదితర నిత్య పూజలు చేశారు. అనంతరం స్వామివారి నిత్య కల్యాణ మూర్తులను బేడా మండపానికి తీసుకొచ్చి సంప్రదాయబద్ధంగా కల్యాణం జరిపారు. కల్యాణంలో పాల్గొన్న 85మంది దాతలకు స్వామివారి ప్రసాదాలు, శేష వస్త్రాలను అందజేశారు.

రామాలయంలో సుదర్శన హోమం

భద్రాచలం, జూలై 14: భద్రాచలం సీతారామచంద్రస్వామివారి దేవస్థానంలో ఆదివారం చిత్తా నక్షత్రానిన పురస్కరించుకొని అర్చకులు సుదర్శన హోమం నిర్వహించారు. తొలుత అర్చకులు సుదర్శన పెరుమాళ్లను యాగశాలకు తీసుకొచ్చి, విశ్వక్సేన ఆరాధన, పుణ్యాహవాచన, కంకణధారణ, సుదర్శన కలశ స్థాపన, సుదర్శన హవనం, పూర్ణాహుతి, ఆశీర్వచనం జరిపారు. అనంతరం సుదర్శన స్వామికి ప్రసాదం నివేదన చేసి, భక్తులకు పంచిపెట్టారు.

నేడు గిరిజన దర్బార్

భద్రాచలం, జూలై 14: భద్రాచలం ఐటీడీఏ కార్యాలయంలో సోమవారం ఉదయం 10.30 గంటలకు జరిగే గిరిజన దర్బార్‌కు అన్ని శాఖల అధికారులు సకాలంలో హాజరు కావాలని భద్రాచలం ఐటీడీఏ పీవో బీ రాహుల్ తెలిపారు. గిరిజన ప్రజలు తమ సమస్యలను లిఖితపూర్వకంగా అందజేయాలని అన్నారు.

వనవాసీ కల్యాణ పరిషత్‌కు 10 ఎకరాల భూ వితరణ

భూదానం చేస్తున్న దాత రాంబాబు

చర్ల, జూలై 14: చర్ల లోని శ్రీ సాయినగర్ కాలనీలో వనవాసీ కల్యాణ పరిషత్‌కు జవ్వాది కోదండ రాంబాబు, కుటుంబ సభ్యులు రు.30 లక్షల విలువచేసే 10 ఎకరాల సొంత భూమిని తల్లిదండ్రులు జవ్వాది నారాయణమూర్తి జయలక్ష్మి జ్ఞాపకార్థం అదివారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వనవాసీ కల్యాణపరిషత్ చర్లలో నిర్వహిస్తున్న కొమురం భీం విద్యాలయంలో ఎందరో ఆదివాసీలకు విద్యనందిస్తున్నారని రాంబాబు అన్నారు. కార్యక్రమంలో జవ్వాది జయకుమార్, వనవాసీ కల్యాణపరిషత్ బాధ్యులు పెద్దాడ ఆశాలత, రాంబాబు కుటుంబ సభ్యులు రవికుమార్, మురళీకృష్ణ, శ్రీకాంత్, పూర్ణిమ, శ్రీనివాస్ పాల్గొన్నారు.

నీట మునిగిన నార చీరెల ప్రాంతం

వరదనీటిలో సీతమ్మ విగ్రహం

పర్ణశాల, జూలై 14: మూడు రోజులుగా కురిసిన భారీ వర్షాలకు పర్ణశాల పుణ్యక్షేత్రంలోని నారచీరెల ప్రాంతం నీటిలోనే మునిగింది. పర్ణశాల రామయ్య దర్శనానికి వచ్చిన భక్తులు నీరచీరెల ప్రాంతం నీట మునిగి ఉండటంతో ఆ ప్రాంతాన్ని దర్శించుకోకుండా వెళ్లిపోతున్నారు. శని, ఆదివారాలు సెలవు దినాలు కావడంతో పర్ణశాల రామయ్య దర్శించుకునేందుకు అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు.

విజయవంతమైన మెగా వైద్య శిబిరం

బూర్గంపాడు, జూలై 14: పొంగులేటి స్వరాజ్యం రాఘవరెడ్డి చారిటబుల్ ట్రస్టు (పీఎస్ఆర్) ఆధ్వర్యంలో భద్రాచలం కిమ్స్ హాస్పిటల్స్ సౌజన్యంతో మోరంపల్లి బంజర్ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన ఉచిత మెగా వైద్య శిబిరం విజయవంతమైంది. సుమారు 250 మందికి పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. మారుమూల ప్రాంతాల్లో ఇటువంటి సేవా కార్యక్రమాలు నిర్వహించిన కిమ్స్ హాస్పిటల్స్ యాజమాన్యాన్ని మోరంపల్లి బంజర్ పరిసర ప్రాంత ప్రజలు అభినందించారు. కార్యక్రమంలో కిమ్స్ హాస్పిటల్ మేనేజ్‌మెంట్ భీమ్‌రెడ్డి బాబురెడ్డి, చావా శివరామకృష్ణ, హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.

సీతారామ ప్రాజెక్ట్ నీళ్లు ఇవ్వాలి

గుండాల, జూలై 14: సీతారామ ప్రాజెక్ట్ ద్వారా గోదావరి నీటిని మైదాన ప్రాంతాలకు తరలిస్తున్నారని, ముందుకు భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు సాగునీరు అందించాలని ఆల్ ఇండియా ట్రైబల్ ఫోరం (ఏఐటీఎఫ్) జాతీయ కన్వీనర్ గుండాల ఎంపీపీ ముక్తి సత్యం, రాష్ట్ర నాయకుడు ఈసం కృష్ణ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ముగ్గురు మంత్రులు ఖమ్మం జిల్లాకు చెందిన వారని, అందుకే మైదాన ప్రాంతాలకు సాగునీరు తరలిస్తున్నారని, ఏజెన్సీ ట్రైబల్ జిల్లా అయిన భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు అన్యాయం చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు మొదటి ప్రాధాన్యతగా నీరు ఇచ్చి ఇతర ప్రాంతాలకు తరలించాలని వారు డిమాండ్ చేశారు.

పెద్దమ్మతల్లిని దర్శించుకున్న ఎంపీ

పాల్వంచ, జూలై 14: ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి ఆదివారం మండలంలోని పెద్దమ్మ తల్లి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ ఈవో రజినికుమారి, వేద పండితులు, అర్చకులు స్వాగతం పలికారు. పూజల అనంతరం అర్చకులు ఆయనకు ఆశీర్వచనం, అమ్మవారి శేష వస్త్ర ప్రసాదం అందించారు. డీసీఎంఎస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు, నాయకులు సీతారాములు, సత్యనారాయణ, యర్రంశెట్టి ముత్తయ్య, బరపటి వాసుదేవరావు, మహిపతి రామలింగం తదితరులు పాల్గొన్నారు.

కొత్వాల ప్రత్యేక పూజలు..

కొత్వాలను సన్మానిస్తున్న కమిటీ సభ్యులు

పాల్వంచ, జూలై 14: మండలంలోని పెద్దమ్మ తల్లి అమ్మవారిని ఆదివారం డీసీఎంఎస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు దర్శించుకున్నారు. మార్కెఫెడ్ డైరెక్టర్‌గా నియమితులైన తర్వాత తొలిసారిగా అమ్మవారిని దర్శించుకున్న ఆయనను అర్చకులు, ఆలయ కమిటీ సభ్యులు శాలువా కప్పి సన్మానించి ఆశీర్వచనం అందించారు. ఆలయ ఈవో రజినికుమారి, దేవాలయ కమిటీ మాజీ చైర్మన్ మహిపతి రామలింగం పాల్గొన్నారు.